కథ

# అపరాధ భావన

పసుపులేటి తాతారావు

గ్రీటింగ్ షాపులో మంచి కార్డ్ ఏమైనా దొరుకుతుందేమోనని నిశితంగా పరిశీలిస్తున్నాడు ప్రసాద్. వెనక నుంచి ఎవరో పిలిచినట్టయి తిరిగి చూసాడు.

రామారావు! ఎప్పుడో పదేళ్ళ క్రితం విడిపోయిన కాలేజ్‌మేట్.

''ఓరి నువ్వా!'' ఆశ్చర్యంగా అడిగాడు ప్రసాద్.

''అవును. నువ్వేమిటి ఇక్కడున్నావు?''

''నేనీ వూళ్ళోనే ఉద్యోగం చేస్తున్నానులే. నీ సంగతేమిటి?''

''ప్రస్తుతం అహమ్మదాబాద్‌లో ఉంటున్నాను'' అంటూ అమలాపురంలో తాము విడిపోయిన దగ్గరనుంచీ ఇప్పటివరకూ ఎక్కడెక్కడ ఎన్నాళ్ళు ఉన్నదీ, ఏమేం చేసిందీ ఏకరువు పెట్టాడు రామారావు.

''అది సరే..ఈ ఊరికెందుకు వచ్చినట్టు?'' అడిగాడు ప్రసాద్.

''అదీ..అదీ..'' అంటూ చెప్పడానికి సిగ్గుపడుతూ మెలికలు తిరిగిపోయాడు రామారావు.

''ఏంటిరా అంతలా సిగ్గుపడిపోతున్నావు? నేన్నీ స్నేహితుడినేగా ఏం ఫరవాలేదు చెప్పు'' ప్రోత్సహించాడు ప్రసాద్.

''మనం కాలేజీలో చదివే రోజుల్లో సుజాత అనే అమ్మాయి ఉండేది గుర్తుందా?''

''ఆ..గుర్తుంది''

''ఆమె ఈ ఊళ్ళోనే ఉంటోందట. అప్పట్లో మా యిద్దరిమధ్య కొన్నాళ్ళు ప్రేమాయణం నడిచిందిలే. ఒకసారి కలిసి పోదామని..''

ప్రసాద్ ఆశ్చర్యంగా చూసాడు. ''ఏమిటి? ప్రేమాయణమే! ఎవరికీ తెలీకుండా ఎలా నడిపావురా బాబు?'' అడిగాడు ప్రసాద్.

''పోవోయ్. ఇలాంటివి ఎవరయినా పబ్లిక్‌గా అందరికీ తెలిసేట్టు చేస్తారేమిటి? అనట్టు వెదకబోయిన తీగ కాలికి తగిలినట్టు బాగానే కనిపించావు. నువ్వీ వూళ్ళో ఉంటున్నావు కాబట్టి సుజాత ఉంటున్న ఇల్లు నీకు తెలిసే ఉండాలే!'' అని అడిగాడు రామారావు.

''తెలుసు''

''అడ్రస్ వ్రాసుకొచ్చాను. ఇది చూసి ఎలా వెళ్ళాలో కాస్త వివరంగా చెప్పరాదూ?'' జేబులోంచి కాగితం తీసి ఇచ్చాడు.

''కానీ ఆ అమ్మాయికి పెళ్ళయిపోయింది'' అన్నాడు ప్రసాద్.

''పదేళ్ళ తర్వాత కూడా పెళ్ళి కాకుండా ఉంటుందని ఎలా అనుకుంటాననుకున్నావు? ఎవడో గొట్టంగాడు చేసుకునే ఉంటాడని తెలుసులేవోయ్. ఈ అడ్రస్‌కి ఎలా వెళ్ళాలో చెప్పుదూ'' అన్నాడు.

''వాళ్ళ ఆయన గొట్టంగాడు కాదు, పెద్ద గూండా. నువ్వక్కడికి వెళ్ళడం రిస్కేమో. కొంచెం ఆలోచించు'' హెచ్చరిస్తున్నట్టుగా అన్నాడు ప్రసాద్.

''అవన్నీ నేను చూసుకుంటానుగానీ ముందు అడ్రస్ చెప్పవోయ్'' అన్నాడు రామారావు.

''సరే. నీ ఖర్మ. రాసుకో'' అంటూ సుజాత ఇంటికి ఎలా వెళ్ళాలో ఆనవాళ్ళతో సహా వివరించాడు.

''థాంక్స్‌రా. అవసరానికి ఉపయోగపడినవాడే అసలైన స్నేహితుడు. నువ్వు నా స్నేహితుడివని నిరూపించుకున్నావు'' అంటూ అతని దగ్గర సెలవు తీసుకొని వెళ్ళిపోయాడు.

★ ★ ★

అడ్రస్ వెతుక్కుంటూ తేలిగ్గానే పట్టుకోగలిగాడు ఇంటిని. తలుపు తెరిచిన సుజాతని చూసి పలకరింపుగా నవ్వాడు రామారావు.

సుజాత ఒక్కక్షణం ఎవరన్నట్టు చూసి వెంటనే గుర్తొచ్చి నవ్వుతూ ఆహ్వానించింది లోపలికి. ఒక్కతే ఉన్నట్టుంది. ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది.

ఒకరినొకరు కుశల ప్రశ్నలతో పరామర్శించుకున్నారు.

''ఎన్నాళ్ళకి చూడగలిగాను సుజాత నిన్ను? అప్పటికీ ఇప్పటికీ నీలో గ్లామర్ ఏమాత్రం తగ్గలేదు సుమా'' అంటూ ఓ కాంప్లిమెంట్ పడేశాడు ఇక ఆలస్యం ఎందుకన్నట్టు.

సుజాత సిగ్గుపడుతూ నవ్వింది.

''మీవారు..'' అంటూ అర్ధోక్తిలో అడిగాడు సోఫాలో కూర్చుంటూ.

''పనిమీద బయటికెళ్ళారు'' అన్నది.

''ఆ రోజులు..ఆనాటి మధురానుభూతులు ఎప్పటికీ మరచిపోలేను సుజాత- చెప్తే నువ్వు నమ్మవు. ఇప్పటికీ నువ్వు నాకు గుర్తొస్తూనే ఉంటావు తెలుసా?'' అన్నాడు. కంఠాన్ని సాధ్యమైనంత తియ్యగా పలికిస్తూ.

''ఇప్పటికీనా?'' ఆశ్చర్యంగా అడిగింది.

''ఆమాటకొస్తే ఎప్పటికీను. నిన్నెలా మరిచిపోగలననుకున్నావు?'' అన్నాడు ఆమె కళ్ళలోకి ప్రేమగా చూస్తూ.

''అది తప్పు కాదా రామారావు?'' అని అడిగింది సుజాత-

''నేనయితే తప్పు అని అనుకోను. ప్రేమ అనేది ఒక మహత్తరమైన మధురానుభూతి. అది ఎవరి మధ్య ఎప్పుడు ఎలా పుడుతుందో చెప్పలేము. అది ఎల్లలు లేనిది. సంఘానికీ కట్టుబాట్లకీ అతీతమైనది. ఇప్పటికీ నేన్నిన్ను ప్రేమిస్తూనే ఉన్నాను తెలుసా?'' అన్నాడు ఆమె కళ్ళలోకి చూస్తూ.

సుజాత ఇబ్బందిగా కదిలింది.

''మీ ఆవిడ ఎలా ఉంటుంది రామారావు?'' అని అడిగింది.

''అందంగానే ఉంటుంది. కానీ నీ అంత కాదులే'' అన్నాడు మరో కాంప్లిమెంట్ విసిరే అవకాశాన్ని దొరకబుచ్చుకుంటూ.

''పిల్లలేం చదువుతున్నారు?'' మాట తప్పించడానికి అడిగింది. చెప్పాడు అతను.

''హేపీ బర్త్‌డే టూ యూ సుజాత...ఇవేళ నీ పుట్టినరోజు కదా?'' ఆమె బర్త్‌డే తనకింకా గుర్తుందనే సంగతి తెలియపరచడం ద్వారా ఆమె దగ్గర మార్కులు సంపాదించేయాలని అతని తాపత్రయం. ఆమె కోసం కొన్న గ్రీటింగ్ కార్డ్‌ని చేతికందించాడు. అలా చేస్తున్నప్పుడు తన చేతి వేళ్ళని ఆమె చేతివేళ్ళకి చాలా క్యాజువల్‌గా తగిలినట్టు తగిలించబోయాడు. అయితే..అందుకు వీలుపడలేదు!

ఇంతలో బయటినుంచి ఎవరో వచ్చిన చప్పుడైతే అటు చూసాడు.

ప్రసాద్! చేతిలో కూల్‌డ్రింక్స్, స్నాక్స్ పాకెట్స్!

''ప్రసాద్..నువ్వు..ఇక్కడ?!'' ఆశ్చర్యంగా అడిగాడు.

''అవును నేనే. సుజాతని పెళ్ళి చేసుకున్న గొట్టంగాడిని నేనే. నిన్ను సర్‌ప్రయిజ్ చేద్దామని పొద్దున్న చెప్పలేదు'' అన్నాడు నవ్వుతూ.

రామారావు షాక్ అయ్యాడు. గొంతులో పచ్చివెలక్కాయ పడ్డట్టు ఫీలయ్యాడు. క్షణంలో తేరుకొని ''సారీరా. నువ్వయి ఉంటావని కనీసం ఊహించనైనా లేదు. లేకపోతే అలా మాట్లాడి ఉండేవాణ్ణే కాదు'' అన్నాడు. అన్నాడేగానీ చాలా గిల్టీగా ఫీలయ్యాడు. అంతకుముందు సుజాతతో

మాట్లాడినవన్నీ తలుచుకుంటే చాలా ఇబ్బందిగా అనిపించింది.

వెధవ ముందే చెప్పొచ్చుగా, ఎందుకింత పిచ్చి పని చేసాడని మనసులోనే మధనపడ్డాడు.

'అయినా పెళ్ళికి ముందు భార్య మరొకడితో ప్రేమ కలాపాలు జరిపిందని తెలిసాక కూడా అంత మామూలుగా ఎలా ఉండగలుగుతున్నాడు? ఆమె మీద కోపంగానీ, అసహ్యంగానీ కలగలేదా? నన్ను నీచుడనీ, దుర్మార్గుడనీ అనుకోవడం లేదా?' అనుకున్నాడు మనసులో.

స్నాక్స్ ప్లేట్లలోకి సర్ది, కూల్‌డ్రింక్స్ గ్లాసుల్లో పోసి తీసుకువచ్చింది సుజాత. తలెత్తి ఆమె ముఖంలోకి చూడలేకపోయాడు రామారావు. దారుణమైన ఇరకాటంలో పడిపోయాడు. నీ భార్యకూ, నాకూ ప్రేమాయణం నడిచిందని డైరెక్ట్‌గా ఆమె భర్తతోనే చెప్పాడు. వాళ్ళ ఇంటికే అతిథిగా వెళ్ళి ఆమెతోనే ప్రేమ పలుకులు పలికి తేలుకుట్టిన దొంగలా దొరికిపోయాడు. 'ఛీ ఛీ ఉదయాన్నే లేచి ఎవరి ముఖం చూసానో ఏమో' అనుకున్నాడు.

కానీ ప్రసాద్, సుజాతలు మాత్రం ఏ తేడా లేకుండా చాలా ఫ్రీగా మాట్లాడుతున్నారు.

''సుజాత, నేన్నీకు థాంక్స్ చెప్పాలోయ్. నీ బర్త్‌డే కి గ్రీటింగ్స్ కొనడానికి ఒకే షాపుకెళ్ళి పదేళ్ళక్రితం విడిపోయిన ఫ్రెండ్స్ ఇద్దరం ఈరోజు కలుసుకున్నాం. ఆ క్రెడిట్ అంతా నీదే'' అన్నాడు ప్రసాద్.

''సర్లెండి. ఇంత మేలు చేసిన నాకు బర్త్‌డేకి చెరో గ్రీటింగ్ కార్డ్ ఇచ్చి సరిపెట్టుకున్నారు. గొప్ప స్నేహితులే'' అంటూ దెప్పిపొడిచింది సుజాత.

వాళ్ళ ధోరణి చూసి రామారావుకి మరింత సంకటం అనిపించింది. 'అదంతా నిజం అన్యోన్యమేనా అన్న అనుమానం కలిగిందతనికి. భార్య ఒకప్పటి ప్రేమికుడిని ఎదురుగా పెట్టుకుని అంత మామూలుగా ఉండగలగడం సాధ్యమేనా ఎవరికైనా' అనుకున్నాడు.

'గుడ్ కపుల్ సిండ్రోమ్' అనే కథ గుర్తొచ్చిందతనికి. ఆ కథలోనూ అంతే. ఇంట్లో నాలుగు గోడల మధ్య హోరాహోరీగా పోట్లాడుకునే జంటలు సైతం బయటికొచ్చాక లోకానికి తాము 'గుడ్ కపుల్'గా కనిపించాలన్న తాపత్రయంలో తెచ్చిపెట్టుకున్న దగ్గరితనాన్ని నలుగురి ముందు ప్రదర్శిస్తూ ఉంటారు. 'వీడూ



అంతేనేమో. నేనలా వెళ్ళగానే సుజాతని సతాయిస్తాడు కాబోలు. లేకపోతే ఆ వంకా ఈ వంకా పెట్టి చితక బాదుతాడేమో' అనుకున్నాడు మనసులో.

సాయంత్రం కాగానే ''మరి నేను వెళ్తానురా'' అంటూ బయల్దేరాడు రామారావు. ''పద. స్టేషన్ వరకు వచ్చి బండెక్కిస్తాను'' అంటూ బయల్దేరాడు ప్రసాద్.

ఫ్లాట్ ఫామ్ మీద స్నేహితులిద్దరూ మాట్లాడుకుంటున్నారు. బండి రావడానికింకా అరగంట పడుతుందని ఎంక్వయిరీలో చెప్పారు.

ప్రసాద్ ఎంత స్వచ్ఛందంగా మాట్లాడుతున్నాడో రామారావు అంత ఇబ్బందిగా ఉన్నాడు. అపరాధ భావన అతని మనసుని తొలిచేస్తోంది. అంతా తెలిసీ తనను బండెక్కించడానికి ఇంతదూరం శ్రమపడి వచ్చిన అతని మంచితనం మరింత బాధిస్తోంది.

ఇక ఉండబట్టలేక అన్నాడు రామారావు ''ప్రసాద్, నువ్వు చాలా గొప్పవాడివిరా. భార్య మరొకర్ని ప్రేమించిందన్న సంగతి తెలిసాకా కూడా నువ్వామెను రవ్వంతయినా అసహ్యించుకోకుండా చాలా మామూలుగా ఉండగలిగావు. మరొకడెవడయినా అయితే పుట్టింటికి తరిమేయడమో, కిరసనాయిల్ పోసి తగలబెట్టడమో చేసి ఉండేవాడు.''

ప్రసాద్ నవ్వాడు. ''ఇందులో నా గొప్పతనం ఏముందిరా. చదువుకొనే రోజుల్లో చాలామంది ప్రేమ వ్యవహారాల్లో పడడం సర్వసాధారణం. ఆ వయసు అలాంటిది. అయితే చాలామంది విషయంలో అది కేవలం ఆకర్షణ మాత్రమే అన్న సంగతి వాళ్ళకు తెలీదు. నిజంగా ప్రేమే అయితే తర్వాత మరొకరిని పెళ్ళి చేసుకొని వాళ్ళతో సుఖంగా కాపురం చేయడం అనేది జరగదు. జరిగిందీ అంటే అదసలు ప్రేమే కాదు. అలాంటి సాధారణమైన విషయం గురించి మధనపడాల్సిన అవసరం ఏముంది!''

రామారావు మౌనంగా వింటున్నాడు.

''అయినా మీ ప్రేమ వ్యవహారం గురించి సుజాత మా పెళ్ళయిన కొత్తలోనే చెప్పింది. మేం అరమరికలు లేకుండా అన్నీ మాట్లాడుకుంటాము. మామధ్య రహస్యాలు అనేవి లేవు. పొద్దున్న నువ్వు కనిపించిన సంగతి, అడ్రస్ అడిగి తెలుసుకున్న సంగతీ అన్నీ సుజాతకి తెలుసు. నిన్ను సర్‌ప్రయిజ్ చేయడం కోసమే తెలీనట్టు నటించమన్నాను'' అన్నాడు ప్రసాద్.

''నీలాంటివాడు నా స్నేహితుడు అయినందుకు చాలా గర్వపడుతున్నాను'' అన్నాడు రామారావు.

''కానీ నీలాంటివాడు నా స్నేహితుడని చెప్పుకోడానికి చాలా సిగ్గుపడుతున్నాను''

గాఢ నిశ్శబ్దంలోంచి గంభీరంగా ప్రేలిన బాంబులా వచ్చిన ఆ మాటకి అదిరిపడ్డాడు రామారావు.

''సుజాత కూడా నిన్ను ప్రేమించింది. అది ప్రేమో, ఆకర్షణో తెలీదు కానీ, ఆ సంగతి మరచిపోయి హాయిగా నాతో కాపురం చేస్తోంది. ఇప్పుడు పదేళ్ళ తర్వాత నువ్వొచ్చి నీ పాత ప్రేమ వ్యవహారం గుర్తుచేసి మళ్ళీ ఆమె జీవితంలో కల్లోలం సృష్టించాలని చూసావు. మరొకడెవడయినా అయితే ఆమెను పుట్టింటికి తరిమేయడమో, కిరసనాయిల్ పోసి తగలెట్టడమో చేస్తాడని నువ్వే అన్నావు. అయినా నువ్వీ పనికి సిద్ధపడ్డావంటే నీదసలు ప్రేమే కాదు. కేవలం స్వార్థం. అవతలి వ్యక్తికి ఏమయినా ఫర్వాలేదనుకొనే అవకాశవాదివి నువ్వు. అటు నీ భార్యనీ, ఇటు నీ ఒకప్పటి ప్రియురాలి భర్తనీ ఏక కాలంలో మోసం చేయడానికి సిద్ధపడ్డ దుర్మార్గుడివి. నువ్విప్పుడు పశ్చాత్తాప పడుతున్నావని నాకు తెలుసు. కానీ అది తప్పు చేసినందువల్ల కలిగిన పశ్చాత్తాపం కాదని కూడా నాకు తెలుసు. ఎందుకంటే సుజాత భర్త నేనుగాక మరొకడెవడయినా అయితే నీలో తప్పు చేస్తున్నానన్న గిల్టీ ఫీలింగ్ కొంచెమైనా కలిగి ఉండేది కాదు.

దొంగతనం చేస్తూ పట్టుబడిపోయినవాడు దొంగతనం చేసినందుకు పశ్చాత్తాపపడడు. కేవలం దొరికిపోయినందుకే బాధపడుతూ ఉంటాడు. ఇప్పుడు నీ పశ్చాత్తాపం కూడా ఇంచుమించు అలాంటిదే. ఒక వ్యక్తిత్వం అంటూ లేకుండా, ఇలాంటి నీచమైన మనస్తత్వం కలిగి ఉండడానికి నీకు సిగ్గుగా లేదా?'' అని అడిగాడు ప్రసాద్.

రామారావు సిగ్గుతో తలొంచుకున్నాడు.

## అందానికి అందం

**ఎప్పుడూ షూటింగ్స్ అంటూ తిరిగే తారలు ఆహారం విషయంలో ఎంతో జాగ్రత్త తీసుకుంటారు. అయితే కొన్ని సందర్భాల్లో తమకిష్టమైనవి బాగా తినేస్తూ ఉంటారు. ఇప్పుడు రిమ్మీసేన్ అదే అంటోంది. 'షూటింగ్స్‌లో అందరిమధ్య తినేటప్పుడు తక్కువగా తినడం సాధ్యంకాదు. దీని ప్రభావం కొన్నాళ్ళకి గానీ తెలీదు' అంటోంది రిమ్మీ. ఈమధ్య బాగా లావైన రిమ్మీ ఫిజికల్ ట్రైనర్ పర్యవేక్షణలో ఎక్సర్‌సైజ్‌లు చేస్తూ స్లిమ్‌గా తయారవుతోంది.**



అతన్ని చిత్రహింస నుండి బయటపడేయడానికన్నట్టు శరవేగంతో దూసుకువచ్చి ఫ్లాట్‌ఫామ్ మీద ఆగింది రైలు బండి.

''నేనన్నానని కాదుగానీ, ఒకసారి నువ్వూ ఆలోచించు. నిర్మొహమాటంగా నీలోని చెడుని విమర్శించేవాడే నిజమైన స్నేహితుడు. నేను నీ స్నేహితుడినని మరోసారి రుజువు చేసుకొంటున్నాను. వెళ్ళగానే ఫోన్ చెయ్యి..'' అంటూ కదిలే బండితోపాటు కొంతదూరం ముందుకు నడుస్తూ చేయి ఊపాడు ప్రసాద్.

బండి కనుమరుగయ్యేవరకూ ఉండి అప్పుడు వెనుతిరిగాడు.